శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లి కథల పోటీలో

## విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

# వంగముల్లు

చింతా అప్పలనాయుడు

కొక్కొరోకో....!

కోడి కూసిందే గానీ... ఇంకా చీకటి పొగమంచుతో.... కలిసి ఊరుని ఊరి పొలిమేరనీ వదిలినట్టు లేదు. మంచుతెరల్ని దాటుకుంటూ చెరువుగట్టుమీంచి బరువుగా అడుగులేస్తూ ఊర్లోకి చేరుకుంది గంగమ్మ. పొగమంచు కరిగి రానురానూ ఆవిరైపోతుంది.

''వంకాయలమ్మా వంకాయలో...!''

గంగమ్మ లయబద్ధంగా వేసిన కేక ఇంట్లోని ఇల్లాళ్ళ చెవులకు తీయని రాగమై సోకుతుంది. ఎక్కడికో వెళ్ళి కూరగాయలు కొనక్కర్లేదని. ఎవరో వంకాయలు కొనడానికి పిలిచినట్టయితే ఆగి... రెండు చేతులతో తలమీద బరువు తట్టను కుడి కాలి ముడుకు మీదకు ఆనించి ఒడుపుగా దించుకుంది గంగమ్మ.

''ఏటీ వంకాయిలు... ఇలగున్నాయి... వొట్టి పుప్పుల్లాగున్నాయి.... కేజీ పది రూపాయిలా...!''

కొనడానికి తట్టచుట్టూ చేరిన వారంతా పుప్పులున్న వంకాయల్ని ఎంచి ప్రక్కన పెడుతున్నారు. వాళ్ళు ఆడే మాటల్లో ధర ఎక్కువన్న అర్థం స్ఫురిస్తుంది.

''అమ్మలూ.... అప్పులేని మనిషి... పుప్పులేని వొంకాయిలు ఉంతాయా సెప్పండి.... మనిషన్న తరవాత వొంటివీద వొక మచ్చయినా ఉండదా.... మీకూ తెలుసు... ఇతనాలు పిరుమైపోనాయి. పురుగుమందు రేట్లు ఆకాశానికి అంటుకున్నాయి. మీకు మాత్రం తెలీదా... తెలిసే..... ఆడతారు''.

ఒక్కొక్కరికీ సానుకూలంగా సమాధానం చెబుతుంది గంగమ్మ.

అడిగినచోటల్లా గంప ఎత్తీదించి కూరగాయలు అమ్మడంలో తలమునక లౌతుంది గంగమ్మ.

''ఒంకాయలమ్మా... ఒంకాయలో...'' కేక పెడుతూనే ప్రక్కవీధిలోకి అడుగు లేసింది గంగమ్మ.

***

''హలో....! ఔనౌను.... నీను పెద్దొలస ప్రెసిడెంటును మాట్లాడతన్ను. సెప్పండి... ఆ....! అలగా...! ఇప్పుడే కవురెడతాను... ఉంతాను''.

గ్రామ సచివాలయం ముందు కుర్చీమీద కూర్చొని సిగరెట్ కాల్చుతున్న సర్పంచ్‌కి ఎక్కడి నుంచో ఫోనొచ్చింది.

సెల్‌ఫోను జేబులో పెడుతూ... సర్పంచ్ ఆత్రంగా అటూఇటూ చూసి.... ఎవరో అటు వేపే వస్తుంటే.

''ఒరే... రాముడో.... వంకాయలు అమ్మడానికి వొచ్చిందట. గంగమ్మ. ఆయమ్మ పెనిమిటి పురుగు మందు కొడతుండి వంగ గుడ్డిల పడిపోనాడట. ఇప్పుడే ఫోనొచ్చింది... చెప్పీరా''.

సర్పంచ్ మాటలు చెవిన పడిందే తడవు వస్తున్న ఆసామి వచ్చిన వేపే పరుగు పరుగున వెళ్ళి గంగమ్మకు చెప్పాడు.

గంగమ్మ తేరుకోలేక పోయింది! ఉరుము, మెరుపూ... లేకుండానే పిడుగొచ్చి మీద పడినట్టయ్యింది.

''ఓలమ్మ నీ నేటి చేసీది తల్లో... నా ఇల్లు ములిగిపోయిందమ్మో...!'' గుండెలు బాదుకొని ఏడుస్తూ అమ్మినచోటే వంకాయల తట్ట వదిలేసి వచ్చిన దారిగుండా పిచ్చిదానిలా పరుగందుకుంది గంగమ్మ.

అప్పటికే నలుగురు మనుషులు గంగమ్మ పెనిమిటిని ఎత్తుకొని పొలం నుంచి రోడ్డు దారివేపు మోసుకొచ్చారు.




పట్నం వేపు వెళ్ళబోతున్న ఆటోను ఆపి ఎక్కించారు.

పరుగుపరుగున వచ్చిన గంగమ్మ ఆటోను సమీపించి పెనిమిటి ప్రక్కనే కూర్చొని రాగాలు పెడుతుంది.

ఆటో పట్నం వేపు పరుగులు పెడుతూ ఆసుపత్రి గేటు ముందాగింది.

ఆసుపత్రి సిబ్బంది గంగమ్మ పెనిమిటిని థియేటర్‌లోకి తీసుకెళ్ళారు.

అప్పటికే అక్కడ చేరిన బంధువుల మధ్య గంగమ్మ శోకాలు పెడుతుంది. ఉండీ ఉండీ మాట్లాడుతుంది. మాట్లాడుతూనే ఏడుస్తుంది.



''కూరగాయల ఎవసాయం వొద్దంటే యినిపించుకున్నాడు గాదు. దాని పఱ్రాకులు పడలేమంతే కళ్ళు ఎఱ్ఱగించోడు. ఇన్నాళ్ళాంటి రోజులు కావు. పురుగు మందులు కొనాలంటే... కళ్ళు తూలిపోతన్నాయి. ఆ మందులు ఎవులుకయినా కొట్టమంతే... వందలు అడుగుతున్నారు. కూలికో నాలికో ఎలిపోదుమంటే... 'కూలికీ నాలికీ ఎలిపోతే... కూలోలు అంతారు గానీ. రైతు బిడ్డలంతారేటి' అని ఏదాంతం సెప్పోడు'' పరిపరి విధాలుగా గంగమ్మ రోదిస్తూనే ఉంది.

రక్తబంధువులు గంగమ్మను ఓదార్చుతూనే ఉన్నారు. ఫరవాలేదని ధైర్యం చెబుతూనే ఉన్నారు.

ఏం... కానుందో.... ఇంకా ఎలాంటి కబురు వినవలసి వస్తుందోనని గంగమ్మ లోలోపల ఆందోళన పడుతూనే ఉంది. తలపుకొచ్చిన దేవతల్ని మొక్కుతూనే ఉంది.

ఆసుపత్రి.... రోగుల మూలుగులతోనూ, ఆర్తనాదాలతోనూ, గోలగోలగా ఉంది.

'వొంగతోట పెంచడమంటే.... అంత సులువేటీకాదు. పండిన పళ్ళన్నీ వొక్కాడుంచి ఎండలో ఎండబెట్టి ఇతనాలు కట్టాల. ఉన్న ఆ యింత మడిసెక్కలోనూ... దాగ్గర అంతజాగాలో నారు జల్లాల. రెండు మూడు రోజులుకి నారు శిరసులెత్తుకోని పచ్చగ కనిపిస్తాది. కూలికి ఎల్లడమంతే.... మా ఆయనకి ఎప్పుడూ ముక్కలమే. ఒళ్ళు దాసుకోని పని చెయ్యడిమంతే వొప్పుకోడు. ఎప్పుడూ పనే... వొక్క సిటమయినా కాలీగా ఉండడు. పనంతే... పడి సచ్చిపోతాడు. పనంతే... పరమాన్నం తిన్నంత సరదా. పనిలోనే ఆనందం ఉందంతాడు. సేతినిండా పని దొరక్కపోతే పిచ్చెక్కిపోతాడు. వంగనారు మొలకలేసిన్నాడు సూడాల. కల్లల్ల సిచ్చుబుడ్డీలు ఎలిగించుకుంతాడు. ఆ సంతోసములో... ఎంత కష్టమయినా మురిసిపోతాడు. నారు మొలిసిన నుండీ వొళ్ళు కానడు. ఏలకి తిండీ తిప్పలి అనడు. ఏతామెక్కిపోతాడు. పూజారికి పూనకమొచ్చి రడం మాను ఎక్కిపోయినట్టుగ. మడి పదునెక్కేదాకా ఎక్కిన ఏతాము దిగడు. నిద్రపట్టడు. అతగాడు ఏతామెక్కి, గూనతోటి నీరు తోడు తుంటే... నున్నగ నూనిరాని సిన్నపిల్లకి పాపిటీసి బుఱ్ఱ దువ్వినట్టిగ నీను తార్లు తీసి ఉడుపందుకుంతాను. ఇంతాసేత్తే... పచ్చగ పువ్వులు పూసి గుడ్డి సూడముచ్చట గుంతాది. పువ్వుల్తోటి పింజిల్తోటి, కాయిల్తోటి నీలోసుకున్న ఆడమనిషిలా గుంతాది వంగ గుడ్డి. అదిగో... అప్పుడు కత మొదలౌతాది. ఎవులు సెప్తుతారో.... రమ్మని కవురే పెడతారో... ఎలిపోత్తాయి పురుగులు. పుట్లుకొలిది పురుగులు. ఆట్ని సంపడానికి మందులు కొనాల. మందులు కొనాలంటే.... అప్పులు సెయ్యాల. మందులుకి ఆ పురుగులు సవ్వవు గదా... మనుసులు బలై పోతన్నారు.'

వంగ గుడ్డి పంట, ఆ పంట కోసం పాటుపడిన పెనిమిటి జ్ఞాపకాల్లో తడిసి ముద్దవుతుంది గంగమ్మ.

కిర్రుమని థియేటర్ తలుపు తెరుచుకునేసరికి గుండె గుభేలుమంటే.... గంగమ్మ జ్ఞాపకాలు పూర్తిగా తెగిపోయాయి. తెలివిపడ్డాడు. మరేమీ ఫరవాలేదు. కాంపౌండర్ తన వేపే వచ్చి చెప్పినమాటలు చెవిల పడేసరికి గంగమ్మకు ఊపిరి ఆడినట్టయ్యింది.

ఆ మధ్యాహ్నానికి థియేటర్ నుండి జనరల్ వార్డుకు గంగమ్మ పెనిమిటిని తీసుకొచ్చారు.

పిల్లలు, బంధువులు, గంగమ్మ పెనిమిటి మంచం చుట్టూ... చేరుకున్నారు.

భార్యాపిల్లల్ని, అక్కడ చేరిన బంధువుల్ని తడిబారుతున్న కళ్ళతో చూశాడు గంగమ్మ పెనిమిటి.

ఆ సాయంత్రానికి... ఇంటికి తీసుకుపోవచ్చునని సుమారు రెండు నెలలు విశ్రాంతి అవసరమని, ఇచ్చిన మందులు జాగ్రత్తగా వాడమని స్టాఫ్‌నర్స్ మందులు ఎలా వాడాలో విడమరిచి చెప్పింది.

***

గంగమ్మ తూర్పువేపు తిరిగి దేవుడికి దండం బెట్టి వరండాలోని గచ్చు మీద దిష్టి కొబ్బరికాయ కొట్టి పెనిమిటిని ప్రక్కలో కూర్చుండబెట్టుకొని ఆటో కదిలి పోతుంటే.... గంగమ్మే మాట్లాడుతుంది.

''ఇన్నావు గదా? నర్సులమ్మ చెప్పిన మాటలు. మందులు గూట్లోన పెట్టీసి.... తెల్లారీ సరికి వంగ గుడ్డిల తూరిపో.... బేగి తగ్గిపోద్ది.

ఆటో పరుగులు పెడుతుంటే.... గంగమ్మ నొడుముతూనే ఉంది.

మళ్ళీ గంగమ్మే ఎత్తుకుంది.

''రెండు మూడు మాసాలు నువ్వు ఏ పనీ సెయ్యిగూడదట. పొలం పని అనకుంట... నువ్వు కుదురుగా కూకుంటే... ఆ పాట్లేవో నీను పడతాను. ఇంక నెరవ నా తాడు గట్టిది. తెగిపోనేదు. డాకటేర్లుకీ నమ్మకం నేదట. ఏ దేవుడు అడ్డుపుల్ల ఏసినాడో! ఆ పుప్పాంకాయలు పట్టికెల్లి నీను అమ్మలేను. అవి సెల్లవు. పదా... నలుగురితో పాటు నారాయణ ఏగారం ఎలిపోదుము''.

వలస వెళ్ళిపోయిన తన బంధువుల్ని తలంచుకొని అక్కడికి ఎలా వెళ్ళాలో ఆలోచనలో పడింది గంగమ్మ.

ఆటో.... ఊరి పొలిమేరల్లో ఆగింది.

ఎవరో దిగి... సామాన్లు దించుకుంటున్నారు.

కాళ్ళు పట్టాయనీ, నడుం నొప్పిగా ఉందనీ.... ఒక్కసారి ఆటోలోంచి దిగుతానంటే... గంగమ్మ చెయ్యి ఊతపట్టుకొని పెనిమిటిని దించింది.

ఎదురుగా కొద్దిపాటి దూరంలో నున్న వంగ గుడ్డి వేపు చూస్తూ నిలుచున్నాడు. గంగమ్మ పెనిమిటిని పసిగడుతూనే ఉంది.

''వంగ తోట... నీకు ప్రాణమే! ఐతే మట్టుకు. అది నీ పేణాలు తీసెత్తంది. అందుకే.... ఎటో ఎలిపోదుమన్నాను. ఇనిపించుకున్నావు గాదు. ఎలిపోయి నోలందరూ తెలివి తక్కువోలా!''

గతాన్ని తవ్వుతూనే ఉంది గంగమ్మ.

''ఉన్న ఊరు, కన్న తల్లిని వొదిలీసి ఎటో ఎలిపోవడా అనుకున్నాను గానీ... ఎవసాయిము ఇసమై పోద్దని అనుకున్నానేటి?''


వ్యవసాయం చెయ్యడం ఇష్టమే అయినా... ఇష్టం లేనట్టు.... వలస వెళ్ళడానికి, అప్రయత్నంగానే ఒప్పుకున్నట్టు తలూపాడు.

ఒక్కసారి వంగ గుడ్డి వేపు తలెత్తి చూశాడు.

పురుగులు పట్టి, పుప్పాంకాయలతో... వంగమొక్కలు కొమ్మల చేతులు చాచి వాడి ముళ్ళగోళ్ళతో.... ఒక్కొక్కటీ తన మీద దాడి చేస్తున్నట్టు కనిపిస్తే... మారు మాటాడకుండా ఆటో ఎక్కి కూర్చుండిపోయాడు గంగమ్మ పెనిమిటి.

మరికొద్ది సేపట్లో ఆటో ఊరు చేరుకుంది!

*



## జనజీవితాన్ని అక్షరబద్ధం చేస్తున్నాను



నేను పుట్టిందీ పెరిగిందీ మట్టిని నమ్ముకుని బతికే మామూలు రైతు కుటుంబంలో. వృత్తి రీత్యా ఉపాధ్యాయుణ్ణి. నా చుట్టూ ఉన్న జన జీవితాన్ని కథల్లో అక్షరబద్ధం చేయడం నా ప్రవృత్తి. కథకులు గంటేడ గౌరునాయుడు పరిచయభాగ్యం కథా సేద్యానికి దారి తీసింది. ప్రముఖ కథకులు అట్టాడ అప్పలనాయుడు, భూషణం మాష్టారు, కథా దీపదారి కాళీపట్నం రామారావు మాష్టార్ల స్ఫూర్తి నన్ను కథావీధిలో నడిపిస్తూనే ఉంది. సంక్రాంతి కథల పోటీలో నా కథకు విశేష బహుమతి రావడం సంతోషంగా ఉంది.

**-చింతా అప్పలనాయుడు**
చినగుడబ గ్రామం, గరుగుబిల్లి
విజయనగరం జిల్లా - 532463
సెల్: 9441713185